పాఠం
9

# రాంపురం : గ్రామ ఆర్థిక వ్యవస్థ

## రాంపురం గ్రామ కథ

ఈ కథ ఒక గ్రామంలోని వివిధ రకాల ఉత్పత్తి కార్యకలాపాలను పరిచయం చేస్తుంది. భారతదేశ గ్రామాలలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి కార్యకలాపం. ఇతర ఉత్పత్తి కార్యకలాపాలను వ్యవసాయేతర కార్యకలాపాలు అంటారు. వీటిలో చిన్న చిన్న వస్తువుల ఉత్పత్తి, రవాణా, దుకాణాల నిర్వహణ వంటివి ఉంటాయి. ఈ అధ్యాయంలో రెండు రకాల కార్యకలాపాలనూ చూద్దాం. ఉత్పాదక వ్యవస్థలను – అవి వ్యవసాయంలో కావచ్చు, కర్మాగారంలో కావచ్చు – ఉత్పత్తి ప్రక్రియలోని మౌలిక అంశాలను ఉపయోగించి విశ్లేషించవచ్చు. ఉత్పత్తి ఎలా వ్యవస్థీకరింపబడుతుందనేది ప్రజల జీవితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది.


పాఠం యొక్క రచయిత రాంపురం (పేరు మార్చాం) గ్రామం వెళ్ళి అక్కడి అన్ని అంశాలను లోతుగా పరిశీలించి ఈ గ్రామ కథను రూపొందించారు. ఆ అధ్యయనం తరువాత పలుమార్లు ఆ గ్రామాన్ని రచయిత సందర్శించారు. ఆ విధంగా కాలక్రమంలో వచ్చిన పలు మార్పులను గమనించగలిగారు. ఈ కథ చదువుతూ రాంపురంలో చూసిన అంశాలు మీ ప్రాంతానికి కూడా వర్తిస్తాయేమోనని మీరు కూడా ఆలోచించవచ్చు, పరిశీలించవచ్చు. లేదా మీ ఊరి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందా? అయితే అది ఏ విధంగా భిన్నంగా ఉందో ఆలోచించండి.

ఈ అధ్యాయంలో అప్పుడప్పుడు మీ ఊరి సందర్భమూ, భారతదేశ పరిస్థితుల ప్రస్తావన వస్తాయి. ఉదాహరణకు రాంపురంలో భూమి పంపిణి గురించి చర్చించేటప్పుడు దేశం మొత్తంలో ఇది ఎలా ఉందో పరిశీలిస్తాం. రాంపురంలో కొన్ని ప్రత్యేక అంశాలు ఉన్నప్పటికీ అందులోని అనేక అంశాలు కొద్దిపాటి మార్పులతో దేశం అంతటా ఉన్నాయి. వీటిని కూడా మీ ప్రాంతంతో పోల్చవచ్చు.

- వ్యవసాయం గురించి మీకు ఏం తెలుసు? వివిధ కాలాల్లో పంటలు ఎలా మారుతూ ఉంటాయి? వ్యవసాయం మీద ఆధారపడిన అధిక శాతం ప్రజలకు భూమి ఉందా, లేక వాళ్లు వ్యవసాయ కూలీలా?

## రాంపురంలో వ్యవసాయం

పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని సారవంతమైన గంగామైదానపు ఒండ్రు నేలల్లో రాంపురం ఉంది. పంజాబ్, హర్యానాలతో పాటు పశ్చిమ ఉత్తర ప్రదేశ్ వ్యవసాయపరంగా సంపన్నమైన ప్రాంతం. ఈ గ్రామానికి చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలతో చక్కటి రవాణాసదుపాయాలు ఉన్నాయి. రాయిగంజ్ అనే పెద్ద ఊరు రాంపురానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది. అన్ని కాలాలకు వాహనాలు తిరిగే రోడ్డు రాయిగంజ్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న జహంగీరాబాదు వరకు ఉంది. ఈ రోడ్డుమీద ఎడ్లబళ్లతో మొదలుకొని జట్కాబళ్లు, బోగీలు (బర్రెలు, దున్నపోతులు లాగే చెక్క బళ్లు–బెల్లం, ఇతర సరుకులను రవాణా చేస్తాయి), మోటారుసైకిళ్లు, జీపులు, ట్రాక్టర్లు, లారీలు కనపడతాయి.



రాంపురంలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి కార్యకలాపం. శ్రమజీవులలో అధిక శాతం తమ జీవనోపాధికి వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. వాళ్లు రైతులు కావచ్చు, వ్యవసాయ కూలీలు కావచ్చు. వీళ్ల సంక్షేమం వ్యవసాయక్షేత్రాల ఉత్పత్తి మీద ఆధారపడి ఉంది.

## భూమి, ఇతర సహజ వనరులు

వ్యవసాయ ఉత్పత్తికి భూమి చాలా కీలకమైన అంశం. అయితే సాగులో ఉండే భూమి విస్తీర్ణం దాదాపు స్థిరంగా ఉంటుంది. రాంపురంలో 1921 నుంచి సాగు భూమి విస్తీర్ణం పెరగలేదు. అంతకుముందే చుట్టుపక్కల ఉన్న అడవులను, ఊళ్లోని బంజరు భూములను వ్యవసాయ భూములుగా మార్చేశారు. మరింత భూమిని కొత్తగా సాగులోకి తీసుకురావటం ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంచటానికి అవకాశం లేదు.

రాంపురంలో కొంచెం భూమి కూడా ఖాళీగా లేదు. వర్షాకాలం (ఖరీఫ్)లో రైతులు జొన్న, సజ్జలు సాగుచేస్తారు. ఆహారధాన్యంతోపాటు వీటి చొప్ప పశువులమేతగా ఉపయోగ పడుతుంది. ఆ తరువాత అక్టోబరు–డిసెంబరు నెలల మధ్య బంగాళాదుంప పంట సాగుచేస్తారు. చలికాలం (రబీ)లో గోధుమ పంటవేస్తారు. ఈ పంటలో కుటుంబ అవసరాలకు కావలసినది ఉంచుకుని మిగిలినది రాయిగంజ్‌లోని మార్కెట్ యార్డ్‌లో అమ్ముతారు. కొంత విస్తీర్ణంలో చెరుకు సాగు చేస్తారు. ఇది సంవత్సరకాలపు పంట. నేరుగా చెరకునుగానీ, లేదా బెల్లం తయారుచేసిగానీ సమీప పట్టణమైన జహంగీరాబాదులోని వ్యాపారస్తులకు అమ్ముతారు.

### *భూమిని కొలవటం*

*భూమిని కొలవటానికి హెక్టారును (రెండున్నర ఎకరాలు) ప్రామాణిక కొలమానంగా ఉపయోగిస్తారు. అయితే గ్రామాల్లో ఎకరాలు, సెంట్లు, గుంటలు వంటి స్థానిక కొలమానాలు ఉన్నాయి. ఒక హెక్టారు అంటే 10,000 చదరపు మీటర్లు. ఒక హెక్టారు క్షేత్రాన్ని మీ పాఠశాల మైదానంతో పోల్చండి. మీ టీచరుతో చర్చించండి.*

ఒకే విస్తీర్ణంలో సంవత్సరంలో ఒకటికంటే ఎక్కువ పంటలను సాగు చెయ్యటాన్ని 'బహుళ పంటల సాగు' అంటారు. భూమి నుంచి ఉత్పత్తిని పెంచటానికి ఇది అత్యంత సాధారణమైన పద్ధతి. రాంపురంలో రైతులందరూ కనీసం రెండు ప్రధాన పంటలు సాగు చేస్తారు, వాళ్లల్లో చాలామంది మూడవపంటగా బంగాళాదుంప సాగు చేస్తున్నారు.

రాంపురంలో బాగా అభివృద్ధి చెందిన నీటిపారుదల వ్యవస్థ ఉన్నందువల్ల రైతులు సంవత్సరంలో మూడు పంటలదాకా సాగు చేస్తున్నారు. రాంపురానికి ఎంతో ముందుగానే విద్యుత్తు వచ్చింది. దీంతో సాగునీటివ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. అప్పటివరకు రైతులు బావులనుంచి నీళ్లు పైకి తోడటానికి 'పర్షియన్ వీల్' అనే పరికరాన్ని ఉపయోగించి సాగునీటి కింద చాలా తక్కువ విస్తీర్ణాన్ని సాగు చేసేవాళ్లు. విద్యుత్తుతో నడిచే బోరుబావుల ద్వారా తేలికగా ఎక్కువ విస్తీర్ణానికి సాగునీటిని అందివ్వవచ్చని రైతులు గుర్తించారు. దాదాపు 50 సంవత్సరాల క్రితమే మొదటి బోరుబావులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తరువాత రైతులు సొంత ఖర్చుతో బోరుబావులు ఏర్పాటు చేసుకోసాగారు. ఫలితంగా 1970 దశాబ్ది మధ్యకాలం నాటికి 264 హెక్టార్ల వ్యవసాయ భూమి సాగునీటికిందికి వచ్చింది.

భారతదేశంలోని అన్ని గ్రామాలకు ఇంతటి సాగునీటి సదుపాయంలేదు. దేశంలోని నదీ మైదానాలు, కోస్తా ప్రాంతాలలో మాత్రమే సాగునీటి సదుపాయాలు బాగున్నాయి. ఇందుకు విరుద్ధంగా దక్కన్ పీఠభూమి వంటి పీఠభూమి ప్రాంతాలలో సాగునీటి సదుపాయాలు తక్కువ. ఈనాటికి కూడా దేశంలోని

సాగు విస్తీర్ణంలో 40 శాతానికంటే తక్కువ విస్తీర్ణానికి సాగునీటి సదుపాయం ఉంది. మిగిలిన ప్రాంతాలలో వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగా ఉంది. భారతదేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాల కోసం 1వ పాఠం చూడండి.


- అట్లాసు చూసి బాగా సాగునీటి సదుపాయం ఉన్న ప్రాంతాలను గుర్తించండి. మీరు ఉంటున్న ప్రాంతం దీనికిందికి వస్తుందా?

భూమి, నీరు వంటి సహజ వనరులను అధికంగా ఉపయోగించటం వల్ల దిగుబడులు, ఉత్పత్తి పెరిగాయి. అయితే ఈ సహజ వనరులను అన్ని సందర్భాలలో సక్రమంగా వినియోగించారని చెప్పలేం. రసాయనిక ఎరువులు, పురుగుమందులను అధికంగా, ఇష్టానుసారంగా వాడినందువల్ల భూసారం తగ్గుతోందని మన అనుభవం ద్వారా తెలుస్తోంది. నీటి పరిస్థితి కూడా అంతే ఆందోళన కలిగిస్తోంది. రాంపురం గ్రామం మాదిరిగానే భారతదేశం అంతటా సాగునీటికి ప్రధానంగా భూగర్భ జలాలమీదే ఆధారపడి ఉన్నారు. ఫలితంగా దేశవ్యాప్తంగా భూగర్భజలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. వర్షాలు బాగా ఉండి, వాననీళ్లు నేలలోకి ఇంకటానికి అనువుగా ఉండే ప్రాంతాలలో కూడా భూగర్భ జలాలు చాలా ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. భూగర్భజలమట్టం పడిపోతుంటే రైతులు మునుపటికంటే లోతైన బోరుబావులు తవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల సాగునీటికి డీజిలు/ విద్యుత్తు వినియోగం కూడా పెరుగుతుంది. ఈ అంశాలను సుస్థిరత, నీటి వనరుల అధ్యాయాల్లో మరింత వివరంగా తెలుసుకుంటాం.

- కింది పట్టిక భారతదేశంలో సాగుకింద ఉన్న భూమిని మిలియన్ హెక్టార్లలో చూపిస్తుంది. పక్కన ఉన్న గ్రాఫ్‌లో వీటిని పొందుపరచండి. గ్రాఫ్ ఏం తెలియచేస్తోంది? తరగతి గదిలో చర్చించండి.

| సంవత్సరం | సాగు విస్తీర్ణం (మిలియన్ హెక్టార్లలో) |
|---|---|
| 1950 | 120 |
| 1960 | 130 |
| 1970 | 140 |
| 1980 | 140 |
| 1990 | 140 |
| 2000 | 140 |
| 2010 | 140 |

*గ్రాఫ్ 1*




- రాంపురంలో పండించిన పంటల గురించి తెలుసుకున్నారు. మీ ప్రాంతంలో పండించే పంటల ఆధారంగా కింది పట్టికను నింపండి.

| పంటపేరు | విత్తనాలు వేసే నెల | పంట కోసే నెల | నీటి / సాగునీటి వనరు (వర్షం, చెరువులు, గొట్టపుబావులు, కాలవలు, మొదలైనవి) |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |

- గ్రామీణ ప్రాంతాలలో 'బహుళ పంటలు' సాగు చెయ్యటానికి దోహదపడే కారణాలు ఏమిటి?

## రాంపురంలో భూ పంపిణీ

వ్యవసాయానికి భూమి ఎంత ముఖ్యమైనదో మీరు గుర్తించి ఉంటారు. దురదృష్టమేమిటంటే వ్యవసాయంలో ఉన్నవాళ్లందరికీ సాగు చెయ్యటానికి సరిపడా భూమిలేదు. రాంపురం జనాభా 2660. అక్కడ వివిధ కూలాలకు చెందిన 450 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలోని అధిక భూమి ఉన్నత కులాల వారి చేతుల్లో ఉంది. వాళ్ల ఇళ్ళలో కొన్ని చాలా పెద్దవి: ఇటుకలు, సిమెంటుతో నిర్మించినవి. జనాభాలో మూడవ వంతు షెడ్యూల్డు కులాల వాళ్లు (దళితులు) ఉన్నారు. వీళ్ల ఇళ్లు ఊరికి దూరాన, ఒక మూలన ఉంటాయి. వీళ్లవి చాలా చిన్న ఇళ్లు, ఇంట్లో కొంతభాగం గుడిసెగా ఉంటుంది.

రాంపురంలో మూడింట ఒక వంతు అంటే 150 కుటుంబాలకు భూమి లేదు. భూమిలేని వాళ్లల్లో అధికశాతం దళితులు. రెండు హెక్టార్లకు మించి భూమి ఉన్న పెద్ద, మధ్యతరగతి కుటుంబాలు 60 దాకా ఉన్నాయి. పెద్ద రైతులలో కొంతమందికి 10 హెక్టార్లకు మించి సాగు భూమి ఉంది. రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని సాగుచేసే కుటుంబాలు 240 ఉన్నాయి. ఈ సన్నకారు రైతులకు వ్యవసాయం ద్వారా కుటుంబానికి సరిపోయే ఆదాయం రాదు.

*1960లో గోవిందు అనే రైతుకు 2.25 హెక్టార్ల భూమి ఉండేది. అప్పుడు దానికి సాగునీటి వసతి అంతగా లేదు. ముగ్గురు కొడుకుల సహాయంతో గోవిందు వ్యవసాయం చేసేవాడు. భోగభాగ్యాలు లేకపోయినా కుటుంబానికి ఉన్న ఒక బర్రెతో వచ్చే అదనపు ఆదాయంతో సరిపోయే ఆహారాన్ని పొందగలిగేవాళ్లు. కొన్ని సంవత్సరాలకు గోవిందు చనిపోవటంతో ముగ్గురు కొడుకులు భూమిని పంచుకున్నారు. ఇప్పుడు ఒక్కొక్కరికి 0.75 హెక్టార్ల భూమి మాత్రమే ఉంది. మెరుగైన సాగునీటి వసతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో కూడా గోవిందు కొడుకులకు భూమినుంచి కుటుంబ అవసరాలు పూర్తిగా తీరడం లేదు. సంవత్సరంలో కొన్ని నెలలపాటు వాళ్లు ఇతర పనులు వెతుక్కోవాల్సి వస్తోంది.*



*పటం 1 : ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గ్రామంలో సాగుభూమి పంపిణీ*

పక్క పటంలో ఊరిచుట్టూ ఉన్న అనేక చిన్న భూకమతాలను మీరు చూడవచ్చు. వీటిని చిన్న రైతులు సాగు చేస్తారు. ఇంకోవైపున వ్యవసాయ విస్తీర్ణంలో సగంకంటే ఎక్కువ పెద్ద పెద్ద కమతాలను చూడవచ్చు. పుస్తకం చివరి కవర్‌పేజీపై పంటల స్కెచ్ పటం చూడవచ్చు.


- పటం 1 లో చిన్నరైతులు సాగుచేసే భూమిని గుర్తించి రంగులు నింపండి.
- అనేక మంది రైతులు ఇంత చిన్న కమతాలను ఎందుకు సాగుచేస్తున్నారు?
- భారతదేశంలో రైతులు, వాళ్లు సాగుచేసే భూముల వివరాలు కింద ఇచ్చిన పట్టికలోనూ, 'పై' చార్టులోనూ ఉన్నాయి.

| రైతుల రకాలు | సాగు భూమి విస్తీర్ణం | రైతుల శాతం | సాగుభూమి శాతం |
|---|---|---|---|
| చిన్న రైతులు | 2 హెక్టార్ల కంటే తక్కువ | 87% | 48% |
| మధ్య తరగతి,పెద్ద రైతులు | 2 హెక్టార్ల కంటేఎక్కువ | 13% | 52% |

**గమనిక:** ఈ గణాంకాలు రైతులు సాగుచేస్తున్న భూమి వివరాలను తెలియజేస్తున్నాయి. ఈ భూమి సొంతం కావచ్చు లేదా కౌలుకు తీసుకున్నది కావచ్చు.

- బాణం గుర్తులు ఏమి సూచిస్తున్నాయి? భారతదేశంలో సాగుభూమి పంపిణీలో అసమానతలు ఉన్నాయని మీరు అంగీకరిస్తారా? మీ సమాధానానికి వివరణ ఇవ్వండి.

గ్రాఫ్ 2




## ఉత్పత్తి నిర్వహణ

రాంపురంలో ఉత్పత్తి ప్రక్రియను పూర్తిగా అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం.

ప్రజలకు అవసరమైన వస్తువులు, సేవలను అందించటమే ఉత్పత్తి ఉద్దేశం. వస్తువులు లేదా సేవలను ఉత్పత్తి చేయటానికి ఉత్పత్తిదారులకు అనేక వస్తువులు కావాలి. వీటిని ఈ కింది విధంగా వర్గీకరించవచ్చు.

మొదటిదిగా భూమి, నీళ్లు, అడవులు, ఖనిజ లవణాల వంటి సహజ వనరులు కావాలి. రాంపురంలో వ్యవసాయానికి భూమిని, నీటిని ఎలా ఉపయోగించుకుంటున్నారో పైన తెలుసుకున్నాం.

రెండవది శ్రామికులు, అంటే పనిచేసేవాళ్లు కావాలి. కొన్ని ఉత్పత్తి ప్రక్రియలకు అవసరమైన పనులు చెయ్యటానికి బాగా చదువుకున్న, నైపుణ్యాలు ఉన్న కార్మికులు కావాలి. మిగిలిన పనులకు శారీరక శ్రమ చేసే కార్మికులు కావాలి. ప్రతి శ్రామికుడు ఉత్పత్తికి అవసరమైన శ్రమను అందిస్తున్నాడు. సాధారణ వాడుకలో కంటే భిన్నంగా శ్రమ అంటే కేవలం శారీరక శ్రమే కాకుండా ఉత్పత్తికి అవసరమైన మానవ ప్రయత్నాలన్నింటినీ అది సూచిస్తుంది. ఉదాహరణకు ఒకరు ఇంజినీరు, ఒకరు మేనేజరు, ఒకరు అక్కౌంటెంటు, ఒకరు సూపర్‌వైజరు, ఒకరు యంత్ర ఆపరేటరు, ఒకరు సేల్స్ రిప్రజెంటేటివ్, ఒకరు రోజువారీకూలీ కావచ్చు – వీళ్లందరూ ఒక వస్తువును తయారుచేసి, అమ్మటంలో కర్మాగారానికి శ్రమను అందజేస్తున్నారు.

మూడవది పెట్టుబడి, అంటే ఉత్పత్తి యొక్క అన్ని దశలలో అవసరమైన రకరకాల వస్తువులు. పెట్టుబడి కిందకు ఏమేమి వస్తాయి?


**(అ) పనిముట్లు, యంత్రాలు, భవనాలు:** రైతు ఉపయోగించే నాగలిలాంటి పనిముట్ల నుంచి మొదలుకొని జనరేటర్లు, టర్బైన్లు, కంప్యూటర్‌తో నడిచే యంత్రాల వంటి అత్యంత సంక్లిష్టమైన యంత్రాలు ఉండవచ్చు. ఇవి ఉత్పత్తి ప్రక్రియతో అయిపోవు. అనేక సంవత్సరాలపాటు ఇవి వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగపడతాయి. ఇలా సంవత్సరాల తరబడి ఉపయోగపడటానికి వాటికి కొంత మరమ్మతు, నిర్వహణ అవసరం అవుతాయి. వీటిని స్థిర పెట్టుబడి లేదా భౌతిక పెట్టుబడి అంటారు. అయితే అనేక సంవత్సరాలు ఉపయోగించిన తరువాత అన్ని యంత్రాలను తీసేసి కొత్త వాటిని తీసుకురావాల్సి ఉంటుంది. అలా మార్చిన ప్రతిసారి మెరుగైన కొత్త  పనిముట్లు, యంత్రాలు వస్తున్నాయి.

**(ఆ) అవసరమైన ముడిసరుకు, డబ్బు:** ఉత్పత్తి ప్రక్రియలో నేతపనిలో ఉపయోగించే దారం, కుండలతయారీలో ఉపయోగించే మట్టివంటి వాటిని ముడి సరుకులు అంటారు. అదే విధంగా అవసరమైన కొన్ని సరుకులను కొనటానికి, ఉత్పత్తి పూర్తి చేయటానికి కావలసిన చెల్లింపులకు డబ్బు అవసరం అవుతుంది. ఉత్పత్తి పూర్తి చెయ్యటానికి, ఆ వస్తువులు, సేవలను మార్కెట్లో అమ్మటానికి కొంతసమయం పడుతుంది. ఆ తరువాతే ఉత్పత్తి ప్రక్రియకు డబ్బు తిరిగి అందుతుంది. ముడిసరుకు, డబ్బుల ఈ అవసరాన్ని నిర్వాహక పెట్టుబడి అంటారు. యంత్రాలు, పరికరాలు, భవనాలవంటి భౌతిక పెట్టుబడికి ఇది భిన్నమైనది. ఉత్పత్తి ప్రక్రియలో ఇవి పూర్తిగా వినియోగింప బడి చివరకు మిగలవు.

నాల్గవది జ్ఞానం, వ్యాపారదక్షత: భూమి, శ్రమ, భౌతిక పెట్టుబడిని ఉపయోగించుకుని సరుకులు లేదా సేవలు ఉత్పత్తి చెయ్యటానికి ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన జ్ఞానమూ, ఆత్మవిశ్వాసమూ తప్పనిసరి. భౌతిక పెట్టుబడులు ఉన్నవాళ్లు, లేదా నియమించుకున్న మేనేజర్లు ఈ ప్రక్రియలో దోహదపడతారు. యజమానులు మార్కెటు రిస్కును కూడా తీసుకోవాలి, అంటే ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవలకు సరిపడా కొనుగోలుదార్లు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. మన సమాజంలో చాలావరకు వస్తువులు, సేవలను మార్కెట్లో అమ్మకం కోసం ఉత్పత్తి చేస్తారు.  కాబట్టి మార్కెటుకోసం ఉత్పత్తిచేసే వ్యాపారవేత్తలు ప్రణాళికలు రూపొందించుకుని, అన్నింటిని ఏర్పాటు చేసుకుని, వాటిని నిర్వహించాలి. వీళ్లు రైతులు, దుకాణదారులు, చిన్నస్థాయి ఉత్పత్తిదారులు, డాక్టర్లు, లాయర్లు వంటి సేవలు అందించేవాళ్లు, లేదా పెద్ద కంపెనీలు కావచ్చు. వాళ్ల వస్తువులను, సేవలను ప్రజలు కొంటారు. వాళ్లు లాభాలు పొందవచ్చు లేదా నష్టపోవచ్చు.

భూమి, శ్రమ, భౌతిక పెట్టుబడులను కలుపుకుని వ్యక్తులు లేదా వ్యాపారవేత్తలు ఉత్పత్తి చేస్తారు. వీటిని ఉత్పత్తి కారకాలు అంటారు.

*చిత్రం 9.1 : చిన్న రైతు, పెద్ద రైతు : పాఠం లోని తరువాత భాగం చదివి, ఉత్పత్తి కారకాలతో వారికి గల సంబంధాన్ని తెలిపే విధంగా వ్యాఖ్య రాయండి.*



## వ్యవసాయానికి అవసరమైన శ్రమ

భూమి తరువాత ఉత్పత్తికి అవసరమైన అంశాలలో శ్రమ ఒకటి. వ్యవసాయానికి ఎంతో శారీరకశ్రమ అవసరం అవుతుంది. చిన్న రైతులు కుటుంబ సభ్యులతో కలిసి దాదాపుగా తమకు అవసరమైన పనులు తామే చేసుకుంటారు. మధ్యతరగతి రైతులు, పెద్ద రైతులు తమ పొలాల్లో పనిచేయటానికి వ్యవసాయ కూలీలను నియమించుకుంటారు.

భూమిలేని కుటుంబాలనుంచి లేదా చిన్న రైతు కుటుంబాలనుంచి వ్యవసాయ కార్మికులు వస్తారు. తమ సొంతపొలాల్లో పనిచేసే రైతుల మాదిరి కాకుండా వ్యవసాయ కూలీలకు భూమిలో పండించే పంటలపై ఎటువంటి హక్కు ఉండదు. దానికి బదులుగావాళ్లు చేసిన పనికి రైతు కూలీ చెల్లిస్తాడు. ఆ పని చెయ్యటానికి వీళ్లను నియమించుకుంటారు.


చిత్రం 9.2 : హిమాలయాల్లో బంగాళా దుంపల పంట తీయడం

డబ్బు రూపేణా కానీ, వస్తు (పంట) రూపేణా కానీ కూలీ ఉండవచ్చు. కొన్ని సమయాల్లో కూలీలకు అన్నం కూడా పెడతారు. ప్రాంతాన్ని బట్టి, పంటను బట్టి, పనిని బట్టి (ఉదాహరణకు విత్తడం, పంటకోత) కూలిరేట్లలో చాలా తేడా ఉంది. పని దొరికే రోజులలో కూడా చాలా తేడా ఉంది. వ్యవసాయ కూలీని రోజువారీ కూలీగా పెట్టుకోవచ్చు, లేదా ఒక ప్రత్యేక పనికి గుత్త పద్ధతిలో పెట్టుకోవచ్చు, లేదా సంవత్సరమంతా జీతానికిపెట్టుకోవచ్చు.

*రాంపురంలో రోజువారీ కూలిపని చేసే భూమిలేని ఒక వ్యవసాయ కూలీ పేరు దళ. అంటే అతడు ప్రతిరోజూ పనికోసం వెతుక్కోవాలి. వ్యవసాయ కూలీలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం కంటే తక్కువ కూలీ దళకు దొరుకుతుంది. రాంపురంలో పనికోసం వ్యవసాయ కూలీల మధ్య తీవ్ర పోటీ ఉంది, కాబట్టి తక్కువ కూలీకైనా పనిచెయ్యటానికి ప్రజలు సిద్ధపడతారు. పెద్దరైతులు ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, పంటకోత యంత్రాలపై ఆధారపడటం పెరగటంతో గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు లభించే పని దినాలు తగ్గిపోతున్నాయి. గత సంవత్సరం మొత్తంలో దళకు వ్యవసాయంలో అయిదు నెలలలోపు పని మాత్రమే దొరికింది. పని దొరకని రోజులలో దళ, అతనిలాంటి వాళ్లు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని ఇప్పించమని పంచాయితీలో దరఖాస్తు చేసుకున్నారు.*

- దళ లాంటి వ్యవసాయ కూలీలు పేదవారుగా ఎందుకు ఉన్నారు?
- తమ కోసం వ్యవసాయ కూలీలు పనిచెయ్యటానికి రాంపురంలోని మధ్యతరగతి, పెద్దరైతులు ఏం చేస్తారు? మీ ప్రాంతంలోని పరిస్థితిని దీనితో పోల్చండి.
- కింది పట్టికను నింపండి:

| ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ | ఒక్కొక్కదానికి మూడు భిన్నమైన ఉదాహరణలు ఇవ్వండి |
|---|---|
| యజమాని/ కుటుంబం కూడా అవసరమైన పని చేస్తారు | |
| పనిచెయ్యటానికి యజమాని కూలీలను నియమిస్తాడు | |

- మీ ప్రాంతంలో వస్తువుల, సేవల ఉత్పత్తిలో ఏ ఏ రకాలుగా శ్రమను పొందుతారు?

*పట్టిక 1 : డిసెంబరు 2011లో వివిధ వ్యవసాయ పనులకు ఆంధ్రప్రదేశ్‌లో రోజువారీ కూలి రేట్లు (రూపాయలలో)*

| కార్మికులు | దున్నటం | విత్తటం | కలుపు తీయటం | నాట్లు వేయటం | కోత | పోత | నూర్పిడి | పత్తి ఏరడం |
|---|---|---|---|---|---|---|---|---|
| పురుషులు | 214 | 197 | 215 | - | 164 | 168 | 152 | - |
| స్త్రీలు | - | 152 | 130 | 143 | 126 | 124 | 118 | 136 |

పై పట్టికలో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పనులకు లభిస్తున్న సగటు కూలి రేట్లు ఉన్నాయి. అయితే ప్రాంతాన్ని బట్టి దీనిలో చాలా తేడా ఉంది.

ఒక రోజంతా పత్తి ఏరినందుకు ఒక మహిళకు 136 రూపాయలు లభిస్తాయి. దున్నడం వంటి కొన్ని పనులు ప్రధానంగా పురుషులు చేస్తారు కాబట్టి దాని కింద మహిళలకు కూలీ పేర్కొనలేదు. వరినాట్లు వేయడం, ప్రత్తి ఏరడం వంటి పనులను ప్రధానంగా మహిళలు చేస్తారు. కొన్ని ఉత్పత్తి కార్యకలాపాలలో మహిళలు, పురుషులు కూడా పాల్గొంటారు. ఒకేపని చేస్తున్నప్పటికీ ఆడవాళ్లకంటే మగవాళ్లకు ఎక్కువ కూలీ లభిస్తోంది. రాష్ట్రంలోని యజమానులందరూ (ప్రభుత్వ, ప్రైవేటు) చెల్లించవలసిన కనీస కూలీరేట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది.

- పైన ఇచ్చిన కూలిరేట్లతో మీ ప్రాంతంలో ఏదైనా పనికి అమలులో ఉన్న కూలిరేట్లను పోల్చండి.
- కనీస కూలీరేట్ల గురించి తెలుసుకుని వాటితో పోల్చండి.
- ఒక పనికి ఆడవాళ్ల కంటే మగవాళ్లకు ఎక్కువ కూలీ ఎందుకు లభిస్తోంది? చర్చించండి.

## పెట్టుబడి: భౌతిక పెట్టుబడి, నిర్వహణ పెట్టుబడిని ఏర్పాటు చేసుకోవటం

ఆధునిక వ్యవసాయ పద్ధతులలో అధిక దిగుబడిని ఇచ్చే రకాలు, ఆధారపడదగిన సాగునీరు, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం గురించి మీరు గత తరగతులలో చదివారు. దీని అర్థం ఉత్పత్తి చేయటానికి రైతులకు తగినంత పెట్టుబడి, అంటే డబ్బు కావాలి. రైతులు వ్యవసాయానికి అవసరమైన భౌతిక పెట్టుబడి, నిర్వహణ పెట్టుబడిని ఎలా సమకూర్చుకుంటారో చూద్దాం.

నిర్వహణ పెట్టుబడికోసం చాలామంది చిన్నరైతులు అప్పు చేయాల్సి ఉంటుంది. వాళ్లు పెద్ద రైతులనుంచి కానీ, వడ్డీ వ్యాపారస్తులనుంచి కానీ, సాగుకు అవసరమయ్యే వివిధ ఉత్పాదకాలను సరఫరాచేసే వ్యాపారస్తులనుంచి కానీ అప్పు తీసుకుంటారు. ఇటువంటి అప్పుల మీద వడ్డీ చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ అప్పులు తిరిగి చెల్లించటం వాళ్లకు చాలా భారంగా ఉంటుంది.

*సవిత ఒక చిన్న రైతు. తనకున్న ఒక హెక్టారు భూమిలో ఆమె గోధుమ పండించాలని అనుకుంటోంది. విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులకే కాక నీళ్లు కొనటానికి, తన వ్యవసాయ పరికరాల మరమ్మతుకు కూడా డబ్బులు కావాలి. నిర్వహణ పెట్టుబడి కింద కనీసం 6000 రూపాయలు అవసరమని ఆమె అంచనా. ఆమె దగ్గర డబ్బు లేకపోవటంతో తేజ్‌పాల్ అనే పెద్ద రైతు దగ్గర అప్పు తీసుకోవాలనుకుంది. నాలుగు నెలల్లో తిరిగి ఇవ్వాలన్న షరతుమీద చాలా ఎక్కువ వడ్డీ అయిన 36% వడ్డీకి ఆమెకు అప్పు ఇవ్వటానికి తేజ్‌పాల్ అంగీకరించాడు. కోత సమయంలో రోజుకు వంద రూపాయల కూలీకి తేజ్‌పాల్ పొలంలో పనిచెయ్యటానికి సవిత అంగీకరించాల్సి వచ్చింది. ఇది చాలా తక్కువ కూలి అని తెలుస్తూనే ఉంది. తన పొలంలో కోత పూర్తిచేసి తేజ్‌పాల్ పొలంలో కోతకు వెళ్లటానికి చాలా కష్టపడాల్సి*

*ఉంటుందని సవితకు తెలుసు. కోతల సమయంలో పని ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుంది. ముగ్గురు పిల్లల తల్లిగా ఆమెపై ఇంటిపని భారం కూడా ఎక్కువే. చిన్న రైతుకు అప్పు దొరకటం కష్టం అని తెలుసు కాబట్టి ఆ షరతులన్నింటికీ సవిత ఒప్పుకుంది.*

చిన్న రైతుల మాదిరి కాకుండా మధ్య తరగతి, పెద్ద రైతులకు సాధారణంగా వ్యవసాయ ఆదాయంలోని మిగుళ్లు అందుబాటులో ఉంటాయి. ఆ విధంగా వాళ్లు విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కూలీలకు చెల్లింపులు వంటి వాటికి అవసరమైన నిర్వహణ పెట్టుబడిని సమకూర్చుకోగలుగుతున్నారు. ఈ రైతులకు సొంత మిగుళ్లు ఎలా ఏర్పడుతున్నాయి? దీనికి సమాధానం తరువాతి భాగంలో తెలుస్తుంది.

ఈ గ్రామంలోని పెద్ద రైతులందరికీ ట్రాక్టర్లు ఉన్నాయి. తమ పొలాలను దున్నటానికి, విత్తటానికి ఉపయోగించటమే కాకుండా వీటిని ఇతర చిన్న రైతులకు అద్దెకు ఇస్తారు. వీళ్లల్లో చాలామందికి నూర్పిడి యంత్రాలు ఉన్నాయి, కొంతమందికి పంటకోత యంత్రాలు కూడా ఉన్నాయి. ఈ పెద్ద రైతులందరికీ తమ పొలాలకు సాగునీళ్లు అందించటానికి అనేక బోరుబావులు ఉన్నాయి. ఈ పరికరాలు, యంత్రాలు అన్నీ వ్యవసాయానికి అవసరమైన భౌతిక పెట్టుబడిలో భాగం.

## రైతుకు మిగులు, లేదా నష్టం

ఉత్పత్తికి అవసరమైన మూడు కారకాలను ఉపయోగించుకుని రైతులు తమ పొలంలో గోధుమలు పండించారని అనుకుందాం. ఉత్పత్తిలో కొంత కుటుంబ అవసరాలకు ఉంచుకుని మిగిలినది బజారులో అమ్ముతారు. సవిత, లేక గోవిందు కొడుకుల వంటి చిన్న రైతులకు మిగులు గోధుమ చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకంటే వీళ్లు ఉత్పత్తి చేసేదే తక్కువ, అందులో చాలావరకు కుటుంబ అవసరాలకు ఉంచుకుంటారు. కాబట్టి మధ్యతరగతి, పెద్ద రైతులే అధిక మొత్తంలో మార్కెటు యార్డుకు గోధుమలు సరఫరా చేస్తారు. మార్కెటు యార్డులోని వ్యాపారస్తులు ఈ గోధుమలను కొని వాటిని తిరిగి పట్టణాలు, నగరాలలోని దుకాణదారులకు అమ్ముతారు.



చిత్రం 9.3 : మార్కెటుకు తీసుకెళుతున్న గోధుమలు

*పెద్ద రైతు అయిన తేజ్‌పాల్‌కు అతని భూములన్నింటిలోంచి 350 క్వింటాళ్ల గోధుమ మిగులుగా ఉంటుంది. దీనిని రాయిగంజ్ మార్కెట్టులో అమ్మి పెద్ద మొత్తంలో డబ్బు పొందుతాడు.*

*ఈ డబ్బును తేజ్‌పాల్ ఏం చేస్తాడు? గత సంవత్సరం తేజ్‌పాల్ ఈ డబ్బులో చాలా వరకు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. తరువాత సవిత లాగా అవసరమైన వాళ్లకు అప్పులు ఇచ్చాడు. తర్వాత పంటకాలంలో తన పొలాలకు అవసరమైన నిర్వహణ పెట్టుబడిని కూడా ఈ డబ్బునుంచే సమకూర్చుకున్నాడు. ఈ సంవత్సరం తన సంపాదనతో తేజ్‌పాల్ మరొక ట్రాక్టరు కొనాలనుకుంటున్నాడు. పక్క గ్రామాలలో అద్దె ట్రాక్టర్లకు మంచి గిరాకీ ఉంది. ఇంకొక ట్రాక్టరుతో అతడి స్థిరపెట్టుబడి పెరుగుతుంది.*

తేజ్‌పాల్ లాగానే ఇతర మధ్యతరగతి, పెద్దరైతులు తమ మిగులు వ్యవసాయ ఉత్పత్తిని అమ్ముతారు. ఈ ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేసి, ఆ తరువాత పంట ఖర్చులకు ఉపయోగిస్తారు. కొంతమంది రైతులు తమ మిగులు డబ్బుతో పశువులు, ట్రక్కులు కొంటారు లేదా దుకాణాలు పెడతారు. ఇవి వ్యవసాయేతర పనులకు పెట్టుబడి అవుతాయి. వాళ్లు ఇంకా భూమి కూడా కొనవచ్చు.

వ్యవసాయ పనులలో నష్టంకూడా వస్తూ ఉంటుంది. వరదలు, పురుగుల వల్ల పంట నష్టపోయినప్పుడు ఇలా జరుగుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవటంవల్ల కూడా నష్టాలు రావచ్చు. ఇటువంటి సందర్భాలలో చిన్న రైతులకు తాము పెట్టిన పెట్టుబడిని తిరిగి పొందటం కూడా చాలా కష్టమౌతుంది.

**మిగులు, ఉత్పత్తికి పెట్టుబడి**

- ముగ్గురు రైతులను తీసుకోండి. ముగ్గురూ గోధుమలు పండించారు. అయితే వాళ్లు ఉత్పత్తి చేసిన దానిలో తేడా ఉంది (రెండవ నిలువు వరస). వివిధ రైతులు ఎదుర్కొనే పరిస్థితిని విశ్లేషించటానికి కొన్ని అంశాలు అందరికీ సమానమని అనుకోవాలి. తేలికగా లెక్క కట్టటానికి ఈ అంశాలను అనుకుందాం:

1. ప్రతి రైతు కుటుంబం వినియోగించే గోధుమల మొత్తం సమానం (మూడవ నిలువు వరస).
2. ఈ సంవత్సరంలో మిగిలిన గోధుమనంతా వచ్చే సంవత్సరం విత్తనంగా రైతులందరూ ఉపయోగించుకుంటారు. అందుకు వాళ్లకు తగినంత భూమి ఉంది.
3. అందరికి ఉపయోగించిన విత్తనంకంటే రెట్టింపు దిగుబడి వస్తుందనుకుందాం. ఉత్పత్తిలో ఎటువంటి అకస్మాత్తు నష్టాలు లేవు.

**పట్టికను పూర్తి చెయ్యండి.**

**1వ రైతు**

| సం॥ము | ఉత్పత్తి | వినియోగం | మిగులు = ఉత్పత్తి - వినియోగం | వచ్చే సంవత్సరానికి పెట్టుబడి |
|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 100 | 40 | 60 | 60 |
| 2వ సంవత్సరం | 120 | 40 | | |
| 3వ సంవత్సరం | | 40 | | |

**2వ రైతు**


| సం॥ము | ఉత్పత్తి | వినియోగం | మిగులు | వచ్చే సంవత్సరానికి పెట్టుబడి |
|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 80 | 40 | | |
| 2వ సంవత్సరం | | 40 | | |
| 3వ సంవత్సరం | | 40 | | |

**3వ రైతు**

| సం॥ము | ఉత్పత్తి | వినియోగం | మిగులు | వచ్చే సంవత్సరానికి పెట్టుబడి |
|---|---|---|---|---|
| 1వ సంవత్సరం | 60 | 40 | | |
| 2వ సంవత్సరం | | 40 | | |
| 3వ సంవత్సరం | | 40 | | |

- మూడు సంవత్సరాలలో ముగ్గురు రైతుల గోధుమ ఉత్పత్తిని పోల్చండి.
- 3వ రైతు పరిస్థితి 3వ సంవత్సరంలో ఏమవుతుంది? అతడు ఉత్పత్తిని కొనసాగించగలడా? ఉత్పత్తిని కొనసాగించటానికి అతడు ఏం చెయ్యాలి?





చిత్రం 9.4 : తేయాకు, రబ్బరు తోటలు. వ్యవసాయ రంగంలో తేయాకు, కాఫీ, రబ్బరు, పళ్లతోటలు వంటివి కూడా వస్తాయి.

## రాంపురంలో వ్యవసాయేతర పనులు

ప్రధాన ఉత్పత్తి కార్యకలాపమైన వ్యవసాయం కాకుండా రాంపురంలో కొన్ని వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలు ఉన్నాయి. రాంపురంలో పని చేసేవాళ్లల్లో 25 శాతం మంది మాత్రమే వ్యవసాయేతర పనుల్లో ఉన్నారు.

### పాడి పరిశ్రమ – రెండవ సాధారణ కార్యకలాపం

రాంపురంలో అనేక కుటుంబాలు పాల ఉత్పత్తి చేస్తాయి. గేదెలకు వివిధ రకాల గడ్డి, వానాకాలంలో సాగుచేసే జొన్న, సజ్జ మేతను మేపుతారు. రాయిగంజ్‌లో పాలు అమ్ముతారు. జహంగీరాబాదుకు చెందిన ఇద్దరు వ్యాపారస్తులు రాయిగంజ్‌లో పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాలను వీళ్లు బులంద్‌షహర్, ఢిల్లీ వంటి దూర ప్రదేశాలకు రవాణా చేస్తారు. ఈ పనిలోని ఉత్పత్తి కారకాలను క్లుప్తంగా తెలుసుకుందాం:

భూమి: గ్రామంలో సొంత కొట్టం (షెడ్డు).

శ్రమ: కుటుంబశ్రమ; ప్రధానంగా మహిళలు గేదెల పోషణ పని చూస్తారు.

భౌతిక పెట్టుబడి: పశువుల సంతలో కొన్న గేదెలు.

నిర్వహణ పెట్టుబడి: తమ భూమిలోంచి వచ్చిన పశువుల మేతతో పాటు కొన్న మందులు.

## రాంపురంలో చిన్నతరహా వస్తువుల తయారీ

ప్రస్తుతం రాంపురంలో వస్తువుల తయారీ (ఉత్పత్తి) పరిశ్రమలో ఉపాధి పొందుతున్న వాళ్లు 50 కంటే తక్కువ మంది ఉన్నారు. పెద్ద నగరాలు, పట్టణాలలోని కర్మాగారాలలో జరిగే ఉత్పత్తి మాదిరి కాకుండా రాంపురంలో ఉత్పత్తి తేలిక పద్ధతులు ఉపయోగించి, చిన్న స్థాయిలో జరుగుతుంది. వీటిని సాధారణంగా ఇంటి దగ్గరకానీ, పొలం దగ్గరకానీ పనిచేస్తూ కుటుంబ శ్రమను ఉపయోగించి చేస్తారు. కూలీలను వినియోగించటం చాలా తక్కువ.

*మిశ్రీలాల్ విద్యుచ్ఛక్తితో పనిచేస్తూ చెరకు రసం తీసే యంత్రం కొని బెల్లం తయారుచేస్తాడు. అంతకు ముందు చెరుకురసం తియ్యడానికి ఎడ్లను ఉపయోగించేవాళ్లు, కానీ ఇప్పుడు అందరూ యంత్రాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తను పండించిన చెరకును ఉపయోగించటమే కాకుండా మిశ్రీలాల్*

*ఇతర రైతుల నుంచి కూడా చెరకు కొని బెల్లం తయారుచేస్తాడు. ఈ బెల్లాన్ని జహంగీరాబాదులో అమ్ముతాడు. ఈ క్రమంలో మిశ్రీలాల్ కొంత లాభం చేసుకుంటాడు.*

- ఈ పనికి మిశ్రీలాల్‌కు ఏ భౌతిక పెట్టుబడులు అవసరం అయ్యాయి?
- దీనికి శ్రమ ఎవరిద్వారా అందుతోంది?
- మిశ్రీలాల్ తన లాభాన్ని ఎందుకు పెంచుకోలేక పోతున్నాడు? అతడికి నష్టాలు వచ్చే సందర్భాలు ఏమిటో ఆలోచించండి.
- బెల్లాన్ని మిశ్రీలాల్ తన ఊళ్లో కాకుండా జహంగీరాబాదులోని వ్యాపారస్తులకు ఎందుకు అమ్ముతున్నాడు?

### రాంపురంలోని దుకాణదారులు

రాంపురంలో వ్యాపారంలో (వస్తువుల మార్పిడిలో) ఉన్నవాళ్లు ఎక్కువగా లేరు. రాంపురంలోని వ్యాపారస్తులు నగరాలలోని హోల్‌సేల్ మార్కెట్లలో సరుకులు కొనుక్కొచ్చి వాటిని రాంపురంలో అమ్ముతారు. రాంపురంలోని చిన్న కిరాణా కొట్లు బియ్యం, గోధుమలు, పంచదార, టీ, నూనె, బిస్కెట్లు, సబ్బులు, టూత్‌పేస్ట్, బ్యాటరీలు, కొవ్వొత్తులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బట్టలు కూడా అమ్ముతాయి.

బస్‌స్టాండ్‌కు దగ్గరగా ఉన్న ఇళ్లల్లో కొన్ని కుటుంబాల వాళ్ళు తమకున్న స్థలంలో కొంత దుకాణాలు తెరవడానికి ఉపయోగించారు. వాళ్లు టీ, సమోసా, కచోరి, కారా, మిఠాయిలు, చాక్‌లెట్లు, శీతల పానీయాలు వంటివి అమ్ముతారు. కుటుంబంలోని మహిళలు, పిల్లలు ఈ పనిలో పాలుపంచుకుంటారు. మన దేశంలో రైతులు, దుకాణదారులు, బజార్లలో తిరిగి వస్తువులు అమ్మేవాళ్లలాగా చాలామంది స్వయం ఉపాధి ఉన్నవాళ్లు ఉన్నారు. వస్తువులు, సేవల ఉత్పత్తికి ప్రణాళికలు తయారుచేసి, ఆ పనులు చేపట్టి అందులోని లాభనష్టాలను భరించాల్సి ఉంటుంది కాబట్టి వాళ్లు యజమానులౌతారు. అదే సమయంలో ఈ ప్రక్రియలో తమ సొంత శ్రమను ఉపయోగిస్తారు.

- ఎవరి స్థలంలో దుకాణాలను నెలకొల్పుతారు?
- తినే వస్తువులు అమ్మే ఈ దుకాణాలలో శ్రమ ఎవరిది?
- ఇటువంటి దుకాణాలకు ఎలాంటి నిర్వహణ పెట్టుబడి అవసరం అవుతుంది?
- భౌతిక పెట్టుబడి కిందికి వచ్చేవాటిని పేర్కొనండి.
- మీ ప్రాంతంలో బజారులో తిరుగుతూ సరుకులు అమ్మేవాళ్లల్లో ఒకరినుంచి వాళ్ల రోజువారీ అమ్మకాలు ఎంతో తెలుసుకోండి. ఏమైనా పొదుపు చేస్తున్నారో, లేదో ఎలా తెలుస్తుంది? టీచరుతో చర్చించండి.

కొంతమంది దుకాణదారులు గ్రామంలో ఉత్పత్తి అవుతున్న వాటిని కొని పెద్ద గ్రామాలు లేదా పట్టణాల్లోని మార్కెట్లలో దుకాణాలకు తిరిగి అమ్ముతారు. ఉదాహరణకు పిండిమర నడిపే వ్యక్తి గ్రామంలోని చిన్న రైతులనుంచి గోధుమలు కొని, వాటిని రాయిగంజ్ మార్కెట్లో అమ్ముతాడు. పిండిమర నిర్వహించడం, గోధుమలు కొని, అమ్మటం రెండూ వేరువేరు వ్యాపారాలు.

### రవాణా; వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం

రాంపురం నుంచి రాయిగంజ్‌కు రోడ్డు మార్గంలో అనేక రకాల వాహనాలు ఉన్నాయి – రిక్షాలు, జట్కాలు, జీపు, ట్రాక్టరు, లారీ. రవాణా రంగంలో లారీ డ్రైవర్లు, ఎడ్ల బళ్ళు, జట్కాలను నడిపేవాళ్లు మొదలైన వ్యక్తులు ఉన్నారు. వాళ్లు మనుషులను, వస్తువులను ఒక చోటునుంచి మరొకచోటుకు చేర్చి దానికి బదులుగా డబ్బులు తీసుకుంటారు. గత కొద్ది సంవత్సరాలుగా రవాణాలో ఉన్నవాళ్ల సంఖ్య పెరుగుతోంది.

*కిశోర్ ఒక వ్యవసాయ కూలి. ఇతర కూలీల మాదిరిగానే కిశోర్‌కు వ్యవసాయ కూలి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోయేది కాదు. కొన్ని సంవత్సరాల క్రితం కిశోర్ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడు. భూమిలేని పేద కుటుంబాలకు తక్కువ వడ్డీపై రుణాలు ఇచ్చే ప్రభుత్వ కార్యక్రమం కింద అతడు ఈ రుణం తీసుకున్నాడు. ఈ డబ్బుతో కిశోర్ ఒక గేదెను కొన్నాడు. ఇప్పుడు అతడు గేదె పాలు అమ్ముతున్నాడు. అంతేకాదు అతడు తన గేదెకు బండిని కట్టి వివిధ సరుకులను రవాణా చేస్తాడు. వారానికి ఒకసారి గంగానదికి వెళ్లి కుండలు చేసే వ్యక్తికి బంకమట్టి తెస్తాడు. లేదా బెల్లం, ఇతర సరుకులు తీసుకుని అప్పుడప్పుడు జహంగీరాబాదు వెళతాడు. ప్రతి నెల అతడికి రవాణాలో కొంత పని దొరుకుతుంది. ఫలితంగా కొన్ని సంవత్సరాల క్రితం కంటే కిశోర్ ఎక్కువ ఆదాయం పొందుతున్నాడు.*

- కిశోర్ స్థిర పెట్టుబడి ఏమిటి? అతడి నిర్వహణ పెట్టుబడి ఏమై ఉంటుంది?
- కిశోర్ ఎన్ని ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొంటూ ఉన్నాడు?
- రాంపురంలో మెరుగైన రోడ్ల వల్ల కిశోర్ లాభపడ్డాడా?

## సారాంశం

ఈ గ్రామంలో వ్యవసాయం ప్రధానమైన పని. కాలక్రమంలో వ్యవసాయ పద్ధతుల్లో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయి. దీనివల్ల అంతే భూమినుంచి రైతులు మరింత ఎక్కువ పంటలు పండిస్తున్నారు. ఇది ముఖ్యమైన పరిణామం – ఎందుకంటే భూమి తక్కువగా ఉంది, స్థిరంగా ఉంది. కానీ ఉత్పత్తిని పెంచటంలో భూమిమీద, సహజ వనరులపైన ఒత్తిడి పెరిగింది. ఉత్పత్తి పద్ధతులను సమీక్షించి, వనరులను సుస్థిర విధానంలో ఉపయోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యవసాయానికి ఇప్పుడు ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతోంది. ఉత్పత్తిలో మిగుల్చుకున్న డబ్బు ద్వారా మధ్యతరగతి, పెద్ద రైతులకు తరువాతి పంటకు పెట్టుబడి ఏర్పాటు అవుతుంది. ఇంకొకవైపున భారతదేశంలో 87 శాతంగా ఉన్న చిన్న రైతులకుపెట్టుబడి దొరకటం కష్టంగా ఉంది. వాళ్ల సాగుభూమి తక్కువగా ఉండటం వల్ల వాళ్ల ఉత్పత్తి సరిపోదు. అదనపు ఉత్పత్తి లేనందువల్ల వాళ్ల మిగులునుంచి పెట్టుబడి అందక అప్పు చెయ్యాల్సి వస్తుంది. తక్కువ ఆదాయం కారణంగా చిన్న రైతులు వ్యవసాయ కూలీ పనికి వెళ్లాల్సి వస్తుంది.

ఉత్పత్తి కారకాలలో శ్రమ ప్రధానకారణమైనందున కొత్త వ్యవసాయ పద్ధతులు ఎక్కువ శ్రమను ఉపయోగించుకోగలిగితే బాగుంటుంది. దురదృష్టవశాత్తు ఇటువంటిది జరగలేదు. వ్యవసాయంలో శ్రమను మితంగా ఉపయోగించుకుంటున్నారు. దాంతో శ్రామికులు అవకాశాల కోసం వెదుక్కుంటూ పక్క గ్రామాలకు, పట్టణాలు, నగరాలకు వలస వెళుతున్నారు. కొంతమంది కార్మికులు గ్రామంలో వ్యవసాయేతర పనులు చేపడుతున్నారు.

ప్రస్తుతం గ్రామాలలో వ్యవసాయేతర పనులు అంత ఎక్కువగా లేవు. గ్రామాలలో అనేక రకాల వ్యవసాయేతర పనులలో (మనం కొన్ని ఉదాహరణలే చూశాం) చాలా కొద్దిమందికే ఉపాధి దొరుకుతోంది. 2009–2010 లో భారతదేశంలోని ప్రతి 100 మంది గ్రామీణ కార్మికులలో 32 మంది వ్యవసాయేతర పనులలో ఉన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

కింద వివిధ పనులు చేసేవాళ్లు కూడా ఇందులో ఉన్నారు. గ్రామీణ కార్మికులకు ఉపాధి హామీ పథకం కొంత అదనపు ఆదాయాన్ని ఇచ్చింది.

భవిష్యత్తులో గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలు ఇంకా పెరగాలి. వ్యవసాయంలా కాకుండా వ్యవసాయేతర పనులకు చాలా తక్కువ భూమి కావాలి. కొంత పెట్టుబడి ఉన్న వాళ్లు వ్యవసాయేతర పనులు చేపట్టవచ్చు. ఎవరికైనా పెట్టుబడి ఎలా లభిస్తుంది? ఇందుకు సొంతంగా ఉన్న పొదుపు మొత్తాలను ఉపయోగించవచ్చు, అయితే తరచుగా దానికోసం అప్పు తీసుకోవాల్సి వస్తుంది. తక్కువ వడ్డీతో అప్పులు అందుబాటులో ఉండటం ముఖ్యం, అప్పుడు పొదుపు మొత్తాలు లేనివాళ్లు కూడా అప్పు తీసుకుని ఏదో ఒక వ్యవసాయేతర పని మొదలుపెట్టగలుగుతారు. వ్యవసాయేతర పనులు విస్తరించటానికి మరొక ముఖ్యమైన అవసరం ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవలు అమ్మటానికి మార్కెటు ఉండటం. రాంపురంలో ఉత్పత్తి అవుతున్న పాలు, బెల్లం, గోధుమల వంటి వాటికి చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాలు, నగరాలలో మార్కెటు ఉండటాన్ని చూశాం. మంచిరోడ్లు, రవాణా, టెలిఫోను సౌకర్యం వంటివి మెరుగుపడటం ద్వారా గ్రామాలకు పట్టణాలు, నగరాలతో మంచి అనుసంధానం ఏర్పడి రానున్న సంవత్సరాలలో గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలు పెరుగుతాయి.

### కీలక పదాలు

| | | | |
|---|---|---|---|
| ఉత్పత్తి కారకాలు | భూమి | శ్రమ | నిర్వహణ పెట్టుబడి |
| స్థిర పెట్టుబడి | మిగులు | వ్యవసాయ కార్యకలాపాలు | వ్యవసాయేతర కార్యకలాపాలు |

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. భారతదేశంలోని ప్రతి గ్రామాన్ని ప్రతి పదేళ్ళకు ఒకసారి జనాభా గణనలో సర్వేచేసి కింద ఇచ్చిన విధంగా వివరాలను పొందుపరుస్తారు. రాంపురానికి సంబంధించిన సమాచారం ఆధారంగా కింది వివరాలను నింపండి.
   అ. ఎక్కడ ఉంది (ఉనికి) :
   ఆ. గ్రామ మొత్తం విస్తీర్ణం:
   ఇ. భూ వినియోగం హెక్టార్లలో:

| సాగులో ఉన్న భూమి | | సాగుకు అందుబాటులో లేని భూమి (ఇళ్ళు, రోడ్లు, చెరువులు, పశువులబీడు ఉన్న ప్రాంతం) |
|---|---|---|
| సాగునీటి కింద | సాగునీరు లేకుండా | |
| | | 26 హెక్టార్లు |

ఈ. సౌకర్యాలు

| | |
|---|---|
| విద్య | |
| వైద్యం | |
| మార్కెటు | |
| విద్యుత్తు సరఫరా | |
| ప్రసార సాధనాలు | |
| సమీప పట్టణం | |

2. రాంపురంలోని వ్యవసాయ కూలీలకు కనీస కూలీ కంటే తక్కువ కూలి ఎందుకు లభిస్తోంది?
3. మీ ప్రాంతంలోని ఇద్దరు కూలీలతో మాట్లాడండి. ఇందుకు వ్యవసాయ కూలీలనుగానీ, భవన నిర్మాణంలో పని చేసేవాళ్ళనుగానీ ఎంచుకోండి. వాళ్ళకు ఎంత కూలీ లభిస్తోంది? వాళ్ళకు నగదు రూపంలో చెల్లిస్తారా, వస్తు రూపంలోనా? వాళ్ళకు క్రమం తప్పకుండా పని దొరుకుతుందా? వాళ్ళ అప్పుల్లో ఉన్నారా?
4. ఒకే విస్తీర్ణం ఉన్న భూమినుంచి ఉత్పత్తిని పెంచటానికి ఉన్న వివిధ పద్ధతులు ఏమిటి? కొన్ని ఉదాహరణలతో వివరించండి.
5. మధ్యతరగతి, పెద్ద రైతులకు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి ఎలా సమకూరుతుంది? చిన్నరైతులకూ వీళ్ళకు మధ్య ఉన్న తేడా ఏమిటి?
6. ఏ షరతుల మీద తేజ్‌పాల్‌నుంచి సవిత అప్పు పొందింది? తక్కువ వడ్డీకి బ్యాంకు నుంచి రుణం లభిస్తే సవిత పరిస్థితి భిన్నంగా ఉండేదా?
7. మీ ప్రాంతంలోని పెద్దవాళ్ళతో మాట్లాడి గత 30 సంవత్సరాలలో సాగునీటి విధానాలలోనూ, వ్యవసాయ పద్ధతులలోనూ వచ్చిన మార్పుల గురించి ఒక నివేదిక రాయండి.
8. మీ ప్రాంతంలోని ప్రధాన వ్యవసాయేతర పనులు ఏమిటి? ఏదైనా ఒక కార్యక్రమాన్ని ఎంచుకుని ఒక చిన్న నివేదిక తయారుచేయండి.
9. ఉత్పత్తికి భూమి కాకుండా శ్రమ కొరతగా ఉండే పరిస్థితిని ఊహించుకోండి. అప్పుడు రాంపురం కథ ఇందుకు భిన్నంగా ఉండేదా? ఎలా? తరగతిలో చర్చించండి.
10. గోసాయిపూర్, మజాలి అనేవి ఉత్తర బీహార్‌లోని రెండు గ్రామాలు. రెండు గ్రామాలలోని 850 కుటుంబాలనుంచి 250 కంటే ఎక్కువ మగవాళ్ళు పంజాబ్ లేదా హర్యానా గ్రామీణ ప్రాంతాలలో, లేదా ఢిల్లీ, ముంబయి, సూరత్, హైదరాబాదు, నాగపూర్ వంటి నగరాలలో పనిచేస్తున్నారు. ఇలా వలస వెళ్ళటం భారతదేశమంతటా గ్రామాలలో సాధారణమే. ప్రజలు ఎందుకు వలస వెళతారు? (గత అధ్యాయానికి మీ ఊహను జోడించి) గోసాయిపుర్, మజాలి గ్రామాలనుంచి వలస వెళ్ళినవాళ్లు ఆయా ప్రాంతాలలో ఏ పని చేస్తారో రాయండి.
11. పట్టణ ప్రాంతాలలో వస్తువుల ఉత్పత్తికి కూడా భూమి అవసరం. గ్రామీణ ప్రాంతంలో భూ వినియోగానికీ, దీనికీ తేడా ఏమిటి?
12. ఉత్పత్తి ప్రక్రియలో "భూమి" అన్న దాని అర్థం మరొకసారి చదవండి. వ్యవసాయం కాకుండా ఇతర ఉత్పత్తి ప్రక్రియలో భూమి ముఖ్యమైన అవసరంగా ఉన్న మరొక మూడు ఉదాహరణలు ఇవ్వండి.
13. ఉత్పత్తికి, ప్రత్యేకించి వ్యవసాయానికి అవసరమైన నీరు ఒక సహజ వనరు. ఇప్పుడు నీటిని పొందటానికి దీని వినియోగానికి ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతోంది. ఈ వాక్యాలను వివరించండి.